# సంగమం

మనం సముద్ర తీరంలో తప్పి పోయిన సంగతి నీకు గుర్తుండే వుంటుంది. కలిస్తే కదా విడి పోవడానికి. కాదు కలిశాం, అలల సాక్షిగా, తీరంలోని పాద ముద్రల సాక్షిగా, పిచ్చుక గూళ్ళ సాక్షిగా, సాక్ష్యా లిక్కడ దేనికీ దొరకవు. కాని కలిశాం నిజంగానే,



గాఢంగానే. ఉపమానాల నవసరం. ఉత్ప్రేక్షల నవసరం. ఊహల్లో కాదు. గాలిలో కాదు. నేల మీదే కలిశాం.

కాని ఎలా విడి పోయాం మనం? మైనా యిప్పుడదంతా తవ్వి పోయడం అనవసరం. విడిపోయాం. ఇటూ అటూ చెదిరి పోయాం. అంగాలు, మెదడూ, హృదయం నేటి దారిని అవి వేరై పోయాయ్. ప్రవాహంలో కొట్టుకు పోయాం. నిర్జన ద్వీపాలై పోయాం. ద్వీపాల్ని సముద్ర పుటలలు కోసేస్తూ వుంటాయి. కరచాలనం చేద్దామన్నా చేతుల్లేవు, తంత్రుల్లేవు, తపాలా బంట్రోతుల్లేరు. ఇపుడు కలిసినా చాలా అసందర్భం. మనమిపుడు అతుకు బొంతలం ఎవరో తలకిందులు చేశారు. ఏదీ వుండవలసినట్లు లేదు. కలిసినా ఒకరి నొకరం గుర్తించడం కష్టం. గత స్నేహం ఒక బాల్యచేష్టలా నవ్వు తెప్పిస్తుందేమో.

ఇప్పుడందరూ బజార్లో బేరాలు చేస్తుంటారు. ఆత్మీయమైన అన్నిటినీ అమ్మేసుకొంటూంటారు. నీకు నేను పూలు కొనివ్వను. హృదయాన్నెలా? వెళ్ళి పోవాలి కదా! వెతుక్కోవాలి కదా! మందులు కొనుక్కోవాలి. బియ్యం కొనుక్కోవాలి. నిలబడ్డానికి స్థలం కొనుక్కోవాలి. ఇప్పుడు గుండె స్థానంలో ఒక త్రాసు వుంటుందేమో గమనించే సమయం లేదు.

ఐనా ఎవరు నువ్వు? వాకిట్లో ముద్దబంతి పువ్వులా, తల్లి ఒడిలోని బాల్యంలా. అయ్యో చెప్పడం కష్టమౌతోంది. ఎక్కడో నిన్ను నా సర్వేంద్రియాలతో ప్రేమించానేమో. నిన్ను కంటుంటే వింటుంటే ఏవో కొత్త పదాలు చిగురిస్తున్నాయే! ప్రేమ. ఏమిటది, ఎక్కడ స్పృశించాదాన్ని, సున్నితమైన ఆ పుష్పాన్ని, ఆ పిట్టని, కలలోనా, కవిత్వంలోనా, ఇపుడెక్కడుంది 'జూ'లోనా?

ఇంక నేను పోవాలి. నా బస్సు తప్పి పోతే కష్టం. అసందర్భమైన కలయిక యిది. ఈ రోడ్డు మీద ఏ వాహనమూ ఆగి పలకరించదు. చిరునవ్వు స్విచాన్ చేసి పోతుంది. అంతేకాని యిలా సోమరిగా ఆగి పలకరించడం, పలవరించడం, కలలోని విషయం. పగలే కలలా, పగటి కలలా! పగటి కలల్లో కూరుకుపోతే సిటీ బస్సు తప్పి పోతుంది. ప్రవాహం సాగి పోతుంది. ఒడ్డున నిలిచి పోతాం. ఒడ్డున ఏముంది? ఇసుక, వెన్నెల. ఈదాలి, ఈది నాలుగు ముత్యాలు సంపాదించి బజార్లో అమ్మి శరీరాని కెరువెయ్యాలి. వెళ్ళు వెళ్ళు. నువ్వు కూడా కలిసిపో బస్సుల్లో స్కూటర్లలో ఆఫీసులో, ఫైళ్లలో.

అయ్యో, అయ్యో, నీతో మాట్లాడానికి తీరిక లేదు, ఓపిక లేదు, మాటల్లేవు. ఎక్కడో తప్పి పోయాం. ఇపుడు కలవడం అసందర్భం. ఏదో బస్సెక్కెయ్. నా దారిలో నేపోతా. నీదార్లో నువ్వు పో. బహుశా మనదార్లు ఏ చౌరాస్తాలోనో ఏకమౌతాయ్. అప్పుడే మాట్లాడుకుందాం. అసలైన మనుషులుగా కావలించుకుందాం, మన మార్గాలతో బాటు.

—రాణీ శివశంకర్